# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 06 -01-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. రాష్ట్రానికి గత ఏడాదికంటే ఈ సంవత్సరం మరిన్ని పెట్టుబడులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.
2. అటవీ భూముల విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్.
3. రాష్ట్రంలో మరో మూడు చోట్ల బీసీ ఐఎఎస్ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత .
4. ప్రధాన పంటలన్నింటికీ సాగువారీగా ప్రణాళికలు, ధరల ముందస్తు అంచనాలను సిద్ధం చేస్తున్నామన్న వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.

-----------------------

రాష్ట్రానికి గత ఏడాదికంటే ఈ సంవత్సరం మరిన్ని పెట్టుబడులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు-ఎస్ఐపిబి ఈరోజు సమావేశమైంది. ఈ సందర్భంగా 8.55 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం తరపున సహకారం అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

-----------------------

రాష్ట్రంలో అటవీ భూముల విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 50 శాతం పచ్చదనం ప్రాజెక్టుల పురోగతిపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ,.. రాష్ట్ర తీరం ప్రాంతాన్ని తుఫాన్లు, తీరం కోత నుండి సంరక్షించేందుకు గ్రీన్ వాల్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఆక్రమించుకున్న అటవీ భూములను విడిపించి, వాటిలో మొక్కలు నాటాలని సూచించారు.

-----------------------

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి రైల్వే స్టేషన్ లో జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు హాల్టింగ్ ను రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి జెండా ఊపి ఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పురందేశ్వరితో పాటు అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ.. రైలు హాల్టింగ్ కోసం అనపర్తి ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆమె కృతజ్ఞతలు తెలియజేస్తూ.

వాయిస్ .. 30 సెకన్లు

-----------------------

రాష్ట్రంలో మరో మూడు చోట్ల బీసీ ఐఎఎస్ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయనున్నామని, వాటి ద్వారా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు శిక్షణ అందజేయనున్నామని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడలోని గొల్లపూడిలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణా కేంద్రాన్ని మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, నిరుద్యోగ బీసీ అభ్యర్థులకు ఈ ఏడాది కూడా ఉచిత సివిల్స్ శిక్షణను ప్రారంభించామని, వంద మంది అభ్యర్థులకు నాణ్యమైన ఆహారం, వసతులతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈసౌకర్యాన్ని వినియోగించుకుని సివిల్స్ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

-----------------------

మెరుగైన ప్రభుత్వ పాలన, సకాలంలో సంస్కరణల అమలు కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న Pro-Active Governance and Timely Implementation-ప్రగతి 50వ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమం ప్రారంభించినప్పటి నుండి చేపడుతున్న సమీక్షల ద్వారా దేశంలోని కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్రజల ఫిర్యాదులను పర్యవేక్షించడం, పరిష్కరించడం ద్వారా పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ప్రగతి కేంద్ర, రాష్ట్రాల మంత్రిత్వ శాఖలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడం ద్వారా సహకార సమాఖ్య వ్యవస్థకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇది కేవలం పర్యవేక్షణకే కాకుండా, పాలనా సంస్కరణలకు కూడా ఒక వేదికగా ఆవిర్భవించింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా జలవనరుల పెంపు కోసం చేపట్టిన "మిషన్ అమృత్ సరోవర్" ఒక గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చు.

-----------------------

ఉపాధి హామీ పనుల అమల్లో నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఎన్డీయే ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ - ‘వీబీ- జీ రామ్ జీ’ పేరుతో కొత్త సంస్కరణలు తీసుకొచ్చిందని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ ఒక ప్రకటనలో తెలిపారు., "‘వీబీ- జీ రామ్ జీ’ పథకం గ్రామీణ కార్మికులకు ఉపాధికి హామీ ఇవ్వడంతో పాటు, గ్రామీణ ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తుందని అన్నారు. గతంలో ప్రతి కుటుంబానికి

ఏడాదికి వంద రోజులున్న ఉపాధి హామీని ఇప్పుడు 125 రోజులకు పొడిగించారని తెలిపారు.

-----------------------

వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ వీబీ- జీ రామ్ జీ పథకం పై గ్రామ సభల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు తెలిపారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీబీ- జీ రామ్ జీ పథకం గ్రామసభ నిర్వహణపై ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, MGNREGA స్థానంలో వచ్చిన ఈ కొత్త చట్టం, 125 రోజుల ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై దృష్టి పెడుతుందని తెలిపారు.

వాయిస్ .. 30 సెకన్లు

-----------------------

రాష్ట్రంలోని ప్రధాన పంటలన్నింటికీ పంటలవారీ ప్రణాళికలు, ధరల ముందస్తు అంచనాలను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఉద్యాన వన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. మామిడి పూత, పిందె దశలో తెగుళ్ల నివారణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే బిందు సేద్యం, తుంపర సేద్య పరికరాలు ప్రతి రైతుకు

అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు సూక్ష్మ సేద్యంలోని కొత్త విధానాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

-----------------------

రైతులు ఆధునిక సాగు పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహ సంచాలకులు ఎం.జాన్సన్ అన్నారు. అనంతపురం జిల్లా రేకులకుంటలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన "కిసాన్ మేళా" కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ, పంటల్లో ఆధునిక సాగు పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పంట నిర్వహణ, కొత్త విత్తనాలు, సాగు యంత్రాల గురించి అవగాహన కల్పించడానికి కిసాన్ మేళా కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.

-----------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రేపు ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా అమరావతి నుండి హెలికాప్టర్ ద్వారా పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ లోని కాఫర్ డ్యామ్, గ్యాప్ 1, గ్యాప్ 2, కుడి కాలువ పనుల ప్రగతిని పరిశీలిస్తారు.అనంతరం మధ్యాహ్నం అధికారులతో పోలవరం నిర్మాణ పనుల ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తారని అధికారులుతెలిపారు. అలాగే రేపు విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్‌టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నారని తెలిపారు.

-----------------------

రాష్ట్రంలోని డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో విద్యార్థులకు ప్రాథమిక కంప్యూటర్ పాఠ్యాంశాలను బోధించనున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో మంత్రి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటి బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సమావేశంలో గురుకులాల విద్యార్థులకు మెరుగైన సంక్షేమం, సౌకర్యాల కల్పనపై చర్చించారు. అలాగే రాష్ట్రంలో 15 నూతన డిగ్రీ కళాశాలల ఏర్పాటు, బేసిక్ కంప్యూటర్ కోర్స్, సౌరశక్తి పైకప్పు ఏర్పాటు వంటి అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురుకులాల విద్యార్థులకు మెరుగైన సంక్షేమం, సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

=======================